క్లుప్తంగా

యోగా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పరకాల : యోగా కేంద్రాన్ని ప్రజలు సద్వి నియోగం చేసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ ఆర్డీ డీ డాక్టర్ ప్రమీల కోరారు. పట్టణంలోని యునాని ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన యోగా కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. యోగా శిక్షణలో ఎంతో అనుభవం ఉన్న రఘుపతి ఇన్‌స్ట్రక్టర్‌గా ఉండటం ఈ ప్రాంత ప్రజల అదృష్టమన్నారు. కార్యక్రమంలో యోగా ఇన్‌స్ట్రక్టర్స్ భోగా రఘుపతి, అమూల్య తదితరులు పాల్గొన్నారు.

పరకాల కోర్టు ఏజీపీగా శంకర్ నియామకం



పరకాల: పరకాల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న లక్కం శంకర్ అసిస్టెంట్ ప్రభుత్వ ప్లీడర్ (ఏజీపీ)గా నియామకం చేస్తూ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శంకర్‌ను స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు అభినందించారు.

విధుల్లో చేరిన కానిస్టేబుళ్లు



ఆత్మకూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏడుగురు కొత్త కానిస్టేబుళ్లు బుధవారం విధుల్లో చేరారు. వీరిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. కానిస్టేబుళ్లకు ఎస్సై పరమేశ్వర్, సిబ్బంది వారికి శుభాకాంక్షలు తెలిపారు.

పరామర్శ



ఆత్మకూరు: మాజీ సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర కార్యదర్శి చిదిరాల సుధాకర్‌రెడ్డికి మాతృవియోగం కలిగింది. సుధాకర్‌రెడ్డి తల్లి సూరమ్మ (95) అనారోగ్యంతో మృతి చెందింది. సుధాకర్‌రెడ్డిని కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి పరామర్శించారు. అలాగే కాంగ్రెస్ నాయకులు కూడా సుధాకర్‌రెడ్డిని పరామర్శించారు.

కమిటీ ఎన్నిక



సంగెం : శ్రీ సంఘమేశ్వర బ్యాండ్ కళాకారుల సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మద్దికుంట్ల యాదగిరి కమిటీకి ధృవీకరణ పత్రం అందజేశారు. వివరాలు వెల్లడించారు. గౌరవ అధ్యక్షుడిగా నంగునూరి శంకర్, అధ్యక్షుడిగా పోడేటి రాజు, ఉపాధ్యక్షుడిగా కొర్ర బాలు, కార్యదర్శిగా మునుకుంట్ల రవి, కోశాధికారిగా పాషా, సలహాదారుడిగా మునుకుంట్ల కొమురయ్య, సభ్యులుగా కందుల కుమారస్వామి, వెలిశాల రవి, హాజీమియా, బానోత్ లక్‌పతి, కొత్తగట్టు నాగేందర్, నాగవెల్లి పూర్ణ ఎన్నికయ్యారు. సమావేశంలో జిల్లా అడ్‌హక్ కమిటీ నాయకులు దొడ్డపల్లి భిక్షపతి, నర్సంపేట డివిజన్ అధ్యక్షుడు వెండి బాబు తదితరులు పాల్గొన్నారు.

7న రాష్ట్ర వ్యాప్తంగా ఆటోల బంద్

నయీంనగర్: ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఈ నెల 7న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న ఒక రోజు బంద్‌ను ఆటో, క్యాబ్ డ్రైవర్లు విజయవంతం చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఆటో జేఏసీ పిలుపునిచ్చింది. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ నాయకుడు ఇసంపెల్లి సంజీవ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయినా ఆటో డ్రైవర్లను పట్టించుకునే పరిస్థితులు కానరావడం లేదని విమర్శించారు. ఆటోడ్రైవర్లకు జీవన భృతి కింద నెలకు రూ.12 వేలు, ప్రత్యేక బోర్డు, రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా, ఇన్సూరెన్స్, రూ.5 వేల పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని కోరారు. సమావేశంలో బాబు, వెంకన్న, జయరాం, శ్రీధర్‌రెడ్డి, సంజీవ, సాయిలు పాల్గొన్నారు.

కెనాల్‌లో ఏపుగా పెరిగిన చెట్లు

- కాల్వలో నీటి ప్రవాహానికి అడ్డంకి
- పొలాలకు అందని సాగునీరు
- ఇబ్బందులు పడుతున్న రైతులు

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని రిజర్వాయర్ నుంచి ఇతర గ్రామాలకు సాగు నీటిని సరఫరా చేయడం కోసం నిర్మించిన కెనాల్ ద్వారా నీటివిడుదల చేయకపోవడంతో పంట పొలాలకు సాగు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. 15 ఏళ్ల క్రితం నాటి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన దేవాదుల ప్రాజెక్టులో భాగంగా ధర్మసాగర్‌లోని చెరువును 1.5 టీఎంసీ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ నిర్మాంచారు. అయితే ఆ రిజర్వాయర్‌కు సౌత్, నార్త్ కెనాల్ నిర్మాణం చేశారు. ప్రతి ఏటా ఆ కాల్వల ద్వారా సాగునీటిని విడుదల చేస్తే ధర్మసాగర్ పరిసర గ్రామాలైన ఎల్కుర్తి, ధర్మసాగర్, టేకులగూడెం, ఉనికిచర్ల, మడిపల్లి, జయగిరి, దేవునూర్, సోమదేవరపల్లి గ్రామాల రైతుల వ్యవసాయ పంట పొలాలకు సాగు నీరందించి పంటలు పండించుకుంటున్నారు. గత రెండేళ్లుగా కెనాల్‌లో చెట్లు ఏపుగా పెరిగి చెత్తా చెదారంతో కూరుకుపోయింది. ఈ క్రమంలో రిజర్వాయర్ నుంచి నీటి విడుదల చేసే సమయంలో కాల్వలో నీరు కమ్ముకొని వెనక్కి వెళ్తున్నాయి. దీంతో చివరి గ్రామాల వరకు నీటి సరఫరా సక్రమంగా సాగడం లేదు. ఈ క్రమంలో అధికారులు కాల్వ నుంచి వచ్చే నీటి విడుదలను నిలిపి వేశారు. ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి స్టేషన్ ఘన్‌పూర్, మల్లన్నగండి, తదితర రిజర్వాయర్‌లకు నిత్యం నీటిని పంపింగ్ చేస్తున్నారు. కానీ స్థానిక రైతుల పంట పొలాలకు మాత్రం నీటిని అందివ్వలేక పోతున్నారు. అధికారులు స్పందించి వచ్చే యాసంగి పంట వరకు కెనాల్‌లో పెరిగిన చెట్లు, పూడికను తొలగించి నీటిని విడుదల చేయాలని ఆయా గ్రామాల రైతులు వేడుకుంటున్నారు.



కెనాల్‌లో ఏపుగా పెరిగిన చెట్లు



రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసే గేట్‌వాల్వ్

చెట్లను తొలగించాలి



కెనాల్ నిండా పెద్ద పెద్ద చెట్లు పెరిగాయి. కాల్వ నిండా చెత్తా చెదారం పేరుకుపోయింది. అధికారులు కాల్వ ద్వారా నీటిని విడుదల చేసే సమయం లో కాల్వ చివరివరకు నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. రైతులు యాసంగి పంటలు వేయడానికి సన్నద్ధం అవుతున్నారు. అధికారులు కాల్వలో పెరిగిన చెట్లను తొలగించి యాసంగి పంటకు నీటిని విడుదల చేయాలి.

– చల్లా శ్రీనివాస్‌రెడ్డి, ధర్మసాగర్, రైతు

కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలి

- ఉన్నతాధికారులు న్యాయం చేయాలని వేడుకోలు

శాయంపేట : భూమిలో అక్రమంగా చొరపడి వరి పంట నాశనం చేసిన కానిస్టేబుల్‌పై పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని చల్లా అశోక్ రెడ్డి దంపతులు వేడుకొంటున్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో బాధిత దంపతులు మాట్లాడుతూ మండలంలోని వసంతాపూర్‌కు చెందిన చల్లా అశోక్ రెడ్డి తనకు 40 ఏళ్ల నుంచి వారసత్వంగా వస్తున్న కొప్పుల శివారులోని పెద్ద చెరువు సమీపంలోని సర్వే నంబర్ 445లో ఉన్న రెండు ఎకరాల భూమిలో వరి పంటను వేశామన్నారు. ఈ నేపథ్యంలో ఇదే గ్రామానికి చెందిన చల్లా విష్ణువర్ధన్‌రెడ్డి పోలీస్ కానిస్టేబుల్ వరి కోతకు వచ్చిన సమయంలో నవంబర్ 26న తమ భూమిలోకి తన అనుచరులతో అక్రమంగా చొరబడి సుమారు 20 గుంటలు వరి పంటను కోసి ధ్వంసం చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. పక్కన ఉన్న రైతు సమాచారం ఇవ్వడంతో 100 డయల్‌కు ఫోన్ చేసినట్లు తెలిపారు. దీంతో పోలీసులు వచ్చి వారిని నివారించినట్లు తెలిపారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు క్షేత్ర స్థాయిలో విచారణ చేసినప్పటికీ కానిస్టేబుల్‌పై ఎలాంటి చర్య తీసుకోలేదని వాపోయారు. దీంతో ఏసీపీ కిషోర్‌కుమార్‌కు ఫిర్యాదు చేసినా తమకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్ కమిషనర్ స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు వేడుకున్నారు. ఈ విషయంపై ఎస్సై ప్రమోద్‌కుమార్‌ను వివరణ కోరగా ఇరువురు పరస్పరం ఫిర్యాదు చేస్తున్నారని దీనిపై విచారణ చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.



మాట్లాడుతున్న అశోక్ రెడ్డి దంపతులు

బామ్మర్దులపై బావ దాడి

ఆత్మకూరు: బామ్మర్దులపై బావ దాడి చేసి గాయపర్చిన సంఘటన మండలంలోని గుడెప్పాడ్‌లో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గుడెప్పాడ్‌కు చెందిన వంగర దుర్గాప్రసాద్ తనకున్న 20 గుంటల భూమిలో ఓ రేకుల షెడ్డు వేసుకోగా మంగళవారం రాత్రి దుర్గాప్రసాద్ బావ పరకాలకు చెందిన అంకం మార్కండేయ దుర్గాప్రసాద్‌కు చెందిన రేకుల షెడ్డు కూల్చివేస్తుండగా అడ్డుకోగా షెడ్డు కోసే బ్లేడ్, ఇనుపరాడ్ తో దాడిచేయగా దుర్గాప్రసాద్‌కు తీవ్రగాయాలయ్యాయి. అలాగే దుర్గాప్రసాద్ అన్న రాజప్రసాద్ రాగా అతనిపై తలపై దాడి చేయడంతో తీవ్ర రక్తస్రావమైంది. ఇద్దరిపై దాడిచేసి గాయపర్చగా బుధవారం దుర్గాప్రసాద్ ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై పరమేశ్వర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న నిర్వాహకురాలు రాధమ్మ

శాయంపేట : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వండి పెడుతున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులకు మూడు నెలలుగా బిల్లులు చెల్లించడం లేదని వెంటనే పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు మామిడి రాధమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం టిఫిన్ కూడా అందజేయాలని తెలిపారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మూడు నెలలుగా బిల్లులు చెల్లించక పోవడంతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం నాణ్యతతో కూడిన ఆహారం అందించాలని చెబుతుందని ధరలు పెరిగిన కారణంగా ఖర్చులు బాగా పెరిగి గతంలో రూ. 5 ఉన్న కోడి గుడ్డు రూ. 7 అయిందన్నారు. కూరగాయల రేట్లు గతం కంటే ఎక్కువగా ఉండడంతో అప్పులు తెచ్చి భోజనాన్ని అందించాల్సి వస్తుందని తెలిపింది. ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని వేడుకున్నారు.

పెద్దపల్లికి తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు



జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న 'కుడా' చైర్మన్ వెంకట్రామిరెడ్డి

కమలాపూర్: పెద్దపల్లిలో బుధవారం జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి 'యువ వికాసం' నిరుద్యోగ విజయోత్సవ సభకు కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ ఆధ్వర్యంలో కమలాపూర్ మండలం నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. తరలివెళ్తున్న కాంగ్రెస్ శ్రేణుల బస్సులను కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి మండల కేంద్రంలో జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తొటం ఝాన్సీరాణి–రవీందర్, వైస్ చైర్మన్ దేశిని ఐలయ్యగౌడ్, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు గుండపు చరణ్‌పటేల్, మాజీ ఎంపీపీ మాట్ల రమేష్, మాజీ ఎంపీటీసీ తడక శ్రీకాంత్, మాజీ సర్పంచ్‌లు మాట్ల రవీందర్, రాజిరెడ్డి, రవి, నాయకులు డాక్టర్ కుమారస్వామి, మొగిలయ్య, సమ్మిరెడ్డి, ఆన్‌కార్ అశోక్‌జీ, పరుశరాములు, శ్రీనివాస్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా రణధీర్‌రెడ్డి

వేలేరు : కొన్ని నెలల క్రితం జరిగిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల ఫలితాలు నేడు (బుధవారం) వెల్లడయ్యాయి. వేలేరు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన గంగుల రణధీర్ రెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందాడు. ఈ స్థానానికి మొత్తం ఏడుగురు బరిలో నిల్వగా ప్రధానంగా అత్తెన రాజేందర్, రణధీర్‌రెడ్డి మధ్యలో జరిగిన పోటీలో రణధీర్‌రెడ్డి సుమారు 600ల పైచిలుకు మెజారిటీ సాధించారు. గెలిచిన అనంతరం రణధీర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు అమరవీరుల స్తూపం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు డప్పుచప్పుళ్లతో ర్యాలీ తీసి బాణసంచాకాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్, నాయకులు జుర్రు సంపత్, శంకర్, సంపత్, సలీంమాలీక్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడిగా ప్రశాంత్.. నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన అక్కల ప్రశాంత్ ఎన్నికయ్యాడు.



సంబురాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

అనర్హుల ఓట్లను తొలగించాలి

విద్యారణ్యపురి: ఉమ్మడి నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో కొంతమంది పేర్లు నిబంధనలకు విరుద్ధంగా నమోదయ్యాయని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్, బాధ్యులు తెలిపారు. ఓటరు జాబితాను క్షణ్ణంగా పరిశీలించి అనర్హుల పేర్లను తొలగించాలని కోరుతూ హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్యకు బుధవారం వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రాజు, ప్రధాన కార్యదర్శి పెండెం రాజు, జిల్లా కార్యదర్శి సీఎస్‌ఆర్.మల్లిక్, తదితరులు ఉన్నారు.

పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలి



గోపాల్‌పూర్‌లో మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

ఎల్కతుర్తి: రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని గోపాల్‌పూర్‌లో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రభాకర్ అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు లక్షల రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేసి రైతాంగాన్ని ఆదుకునేందుకు కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజల వద్దకు వెళ్లే ప్రయత్నం చేయడం అభినందనీయమన్నారు. ప్రజా సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి నిరంతరం కృషి చేసే పార్టీ భారత కమ్యూనిస్ట్ పార్టీ అన్నారు. ఆయన వెంట సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్, మండల కార్యదర్శి రాములు, లక్ష్మణ్, మనోహర్, రాజమౌళి, రవీందర్, లలిత ఉన్నారు.

అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న స్కైలాబ్

కాజీపేట: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని కులవివక్ష పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ సూచించారు. అంబేడ్కర్ 68వ వర్ధంతిని పురస్కరించుకుని 75 ఏళ్ల భారత రాజ్యాంగ వార్షికోత్సవం – సవాళ్లపై కాజీపేట 62వ డివిజన్ సోమిడి ప్రభుత్వ కమ్యూనిటీ హాల్‌లో రెండో రోజు బుధవారం సదస్సు నిర్వహించారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ అనుబంధం సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అర్హులైన వారికి సంక్షేమ ఫలాలు

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల: ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందిస్తామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలో ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా 18, 19 వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని సూచించారు. అనంతరం జరిగిన ప్రజాసదస్సులో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ గత పాలకులు డబుల్ బెడ్ రూం ఇళ్లు అంటూ ప్రజలను మోసం చేశారని అన్నారు. వారి మోసపూరిత మాటలు నమ్మి ఉన్న గూడును విప్పి పందిరి వేసుకొని జీవించడం జరుగుతుందన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని దీనికోసం సామాజిక ఆర్థిక కులగణన పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇంటి స్థలం ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత, శిథిలావస్థలో ఉన్న ఇంటికి రెండో ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, ఆర్డీఓ కె.నారాయణ, ఇన్‌చార్జ్ కమిషనర్ సుష్మ, కౌన్సిలర్లు పంచగిరి జయమ్మ, ఏకు రాజు, మడికొండ సంపత్‌కుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రాజిపేట కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలి

- డీఎంహెచ్‌ఓ అప్పయ్య

కమలాపూర్: వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలందించాలని డీఎంహెచ్‌ఓ అప్పయ్య సూచించారు. కమలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు మండలంలోని గూడూరు, అంబాలలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా కమలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని, ల్యాబ్, ఫార్మసీ, ఆస్పత్రి పరిసరాల్ని పరిశీలించారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమయపాలన, అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డితో కలిసి కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. ఆయా కార్యక్రమాల్లో పీహెచ్‌సీ వైద్యాధికారులు నాగరాజు, మాధవి, అరుణ్‌కుమార్, హెచ్‌ఈఓ రవీందర్, ల్యాబ్ టెక్నీషియన్, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ అప్పయ్య

ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

ఎల్కతుర్తి : ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక విద్యావనరుల కేంద్రం ఆవరణలో బుధవారం ఎంఈఓ చదువుల సత్యనారాయణ ఆధ్వర్యంలో దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం సమగ్రశిక్ష ద్వారా ప్రత్యేక అవసరాలు గల ఉచిత ఉపకరణాల పంపిణీ, రవాణా భత్యం, ఎస్కార్ట్ అలవెన్స్‌లు, బాలికల ఉపకార వేతనం, విలీన విద్య గురించి వివరించారు. అంగవైకల్యాలు రావడానికి గల కారణాలను తెలుపుతూ వాటి ని వారణ మార్గాలను సూచించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను వివక్షతో చూడకుండా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీ సుమన్, సీ ఆర్పీలు మర్రి రవికుమార్, పబ్బు రాజు, మర్రి రవికుమార్, సురేష్ విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న దివ్యాంగులతో ఎంఈఓ సత్యనారాయణ

గొర్రెల పెంపకందారుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జీఎంపీఎస్ నాయకులు

ఐనవోలు: గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం జీఎంపీఎస్ నాయకులు తహసీల్దార్ విక్రమ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల కార్యదర్శి నల్లబెట్ల చిన్న రాజు మాట్లాడుతూ గొల్ల, కురుమలకు రూ.2 లక్షల నగదు బదిలీ చేస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. దీనికి నిరసనగా డిసెంబర్ 9న ప్రజాభవన్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందన్నారు. మండలం నుంచి అధిక సంఖ్యలో గొల్ల కురుమలు హాజరు కావాలని కోరారు. సంఘం నాయకులు రా జారపు రాజు, మాజీ సర్పంచ్ స్వామి, ఎల్లయ్య, రాజు, అశోక్, చంద్రయ్య, రాజు, బక్షేలు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల బకాయిలు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

- సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్

హన్మకొండ అర్బన్: ఆశ కార్యకర్తలకు పెండింగ్‌లో ఉన్న లెప్రసీ, టీబీ, పల్స్‌పోలియో, ఎన్సీడీ సర్వే బకాయిలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి, ఆశ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు రాగుల రమేశ్ డిమాండ్ చేశారు. ఈమేరకు తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ముందుగా ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియం నుంచి కలెక్టరేట్ వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా రాగుల రమేష్ మాట్లాడుతూ ఆశ వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని, సంవత్సరానికి నాలుగు జతల దుస్తులు, రిటైర్మెంట్ బెనిఫిట్లు రూ.5 లక్షలు చెల్లించాలని, పారితోషకంలో సగం పింఛన్‌గా నిర్ణయించాలని, ప్రతి ఆదివారం, పండుగలకు వేతనంతో కూడిన సెలవులు, ప్రతి సంవత్సరం 20 రోజులు వేతనంతో కూడిన క్యాజువల్ లీవ్‌లు ఇవ్వాలని కోరారు. అనంతరం ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులతో కలిసి పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్‌ఓ వైవీ.గణేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్వేత, యాకూబి, కల్పన, సంధ్య, రజిత, శ్రీవాణి, కవిత, శోభ, సూర్యకళ, సరిత, సుకన్య పాల్గొన్నారు.